

ట్రాఫిక్ పోలీస్‌కు రాఖీ కడుతున్న యువతి

నాకు నీవే 'రక్ష'

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సోదరి, సోదరుల ప్రేమకు ప్రతీక అయిన రక్షాబంధన్ వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. మహిళలు తమ సోదరులకు రాఖీలు కట్టి ఆశీస్సులు అందుకున్నారు. పండుగ సందర్భంగా మార్కెట్‌లో రాఖీల కొనుగోళ్ల సందడి కనిపించింది. పట్టణంలోని 16వ వార్డులో కొంతమంది మహిళలు పర్యావరణ హితమైన రాఖీలు తయారుచేసి తమ సోదరులకు కట్టారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో స్థానిక ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. 'నీకు నేను రక్ష, నీవు నాకు రక్ష, మనందరం ఈ దేశానికి రక్ష' అంటూ నినాదాలు చేశారు.



పర్యావరణ రాఖీలు కడుతున్న మహిళలు



తోగుటలో సోదరుడికి రాఖీ కడుతున్న చిన్నారి



చెటుకు రాఖీ కడుతున్న యువతి



సిద్దిపేటలో అన్నకు రాఖీ కడుతున్న సోదరి

రాఖీ రద్దీ

సిద్దిపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాఖీ పౌర్ణమి సందర్భంగా సిద్దిపేట ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. పండుగకు ఊళ్లకు వెళ్లే, వచ్చే వారితో బస్సులు కిక్కిరిశాయి. సిద్దిపేట డిపోలోని 320 మంది సిబ్బందిలో 280 మంది శుక్ర, శనివారాల్లో విధులు నిర్వహించారు. బస్సుల్లో సీట్ల కోసం కిటికీల గుండా లోపలికి వెళ్లేందుకు ప్రయాణికులు ప్రయత్నించారు. ఈ రద్దీని చూసి కొంతమంది ప్రైవేట్ వాహనాల్లో గ్రామాలకు వెళ్లారు. ఇదే అదునుగా వాటి యజమానులు అధిక ఛార్జీలు వసూలు చేసినట్లు సమాచారం. ఇక సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సుల్లో పురుష ప్రయాణికులకు సాధారణ ఛార్జీపై రూ.50 నుంచి రూ.60 వరకు పెంచినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపినట్లు ఆర్టీసీ మేనేజర్ రఘు తెలిపారు.



సీటు కోసం పాట్లు..



బస్టాండ్‌లోనే రాఖీ వేడుకలు

ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులు ఏర్పాటు చేసి, సిబ్బందిని అప్రమత్తం చేశారు. విధుల్లో ఉన్న సిబ్బందికి పాత బస్టాండ్‌లోనే భోజనం ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని జేబీఎస్‌కు 40, వేములవాడకు 3, హన్మకొండకు 2 అదనపు ట్రిప్పులు నడిపారు. విధుల్లో ఉన్న ఆర్టీసీ సిబ్బంది ఒకరికొకరు రాఖీలు కట్టుకుని పండుగ జరుపుకున్నారు.



సిద్దిపేట ఆర్టీసీ బస్టాండ్ లో ప్రయాణికుల సందడి

వలస పక్షులపై ఏజెంట్ల వల..!

ఉన్న ఊరిని.. తమ వాళ్లను వదిలి.. పొట్ట చేత పట్టుకుని దేశం కానీ దేశం వెళ్తున్న వారిలో కొందరు దగాకు గురవుతున్నారు. ఏజెంట్ల మోసాలు.. అక్కడికి వెళ్లిన తర్వాత యాజమాన్యాల దాష్టికాలకు బలై ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. కోటి కలలతో వెళ్లి అప్పులు చేసి, సర్వం పోగొట్టుకొని స్వదేశానికి తిరిగొస్తున్న వారి వ్యథలు గుండెను పిండేస్తున్నాయి. దుబ్బాక మండలంలో మూడు నెలల్లో పదుల సంఖ్యలో ఇలాగే మోసపోయి, ఆర్థికంగా, మానసికంగా చితికిపోయారు. నకిలీ ఏజెంట్లు, అసత్యపు హామీలతో నిరుద్యోగులను ఉచ్చులోకి లాగి, లక్షలు వసూలు చేస్తున్నారు. విదేశాల్లో పని చేయడానికి వెళ్లిన తర్వాత, వారి పాస్‌పోర్టులు లాక్కుని తక్కువ జీతంతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారు.

-దుబ్బాక, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి)



- విదేశీ కొలువులు..లక్షల్లో జీతాలంటూ మోసం
- డబ్బులు తీసుకుని ముఖం చాటేస్తున్న ఏజెంట్లు
- కొందరిని ముంబయి తీసుకెళ్లి వదిలేస్తున్న వైనం
- మూడు నెలల్లో 50 మంది బాధితులు
- విదేశాలకు వెళ్లి బందీలుగా మారి వెట్టిచాకిరీ

దుబ్బాక మండలంలో గత మూడు నెలల్లో సుమారు 50 మంది వరకు గల్ఫ్, రష్యా వంటి దేశాలకు వెళ్లి అప్పులపాలై, అనారోగ్యంతో బాధపడడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డట్లు తెలిసింది. ఒకవేళ దేశం కాని దేశంలో చనిపోతే కనీసం శవాన్ని కూడా తెచ్చుకోలేని దయనీయ స్థితి నెలకొన్నది. దీంతో అక్కడే స్నేహితుల ద్వారా అంత్యక్రియలు జరిపించి కన్నీరు దిగమింగుకుంటున్నారు కుటుంబ సభ్యులు. నెలల తరబడి ప్రయత్నాలు చేసి చివరికి మృతదేహాలను తెప్పించినా చూపునకు కూడా నోచుకోని స్థితిలో కుళ్లిపోతున్నాయి. ఏజెంట్లు మంచి ఉద్యోగాలు, జీతాలు ఇప్పిస్తామని చెప్పి, తక్కువ వేతనంతో కూడిన లేబర్ పనులు చేయిస్తున్నారని బాధితులు చెబుతున్నారు. కొంతమందిని ముంబైలోనే వదిలేసి పారిపోయిన ఘటనలు కూడా ఉన్నాయి.

ఒకేసారి తొమ్మిది మందికి టోకరా

దుబ్బాక, అక్బర్‌పేట-భూంపల్లి మండలాలకు చెందిన తొమ్మిది మంది యువకుల నుంచి ఒక ఏజెంట్ కెనడాలో ఉద్యోగం ఇప్పిస్తానని ఒక్కొక్కరి నుంచి మూడు లక్షల రూపాయలు వసూలు చేశాడు. హైదరాబాద్‌లో మరో ఏజెంట్ వద్దకు తీసుకెళ్లి, డబ్బులు తీసుకున్న తర్వాత ఆఫీస్ లోపలికి కూడా రానివ్వలేదు. దీంతో బాధితులు దుబ్బాక పోలీసులను ఆశ్రయించారు.



ముంబైలో వదిలేసిన ఏజెంట్

సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామానికి చెందిన మోత్కు నవీన్, వాతం భూమేష్, రాందేని శ్రీనివాస్‌లను దుబాయ్‌లో 4 లక్షల జీతంతో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి, ఏజెంట్ ముంబైలో వదిలేశాడు. వారి వద్ద నుంచి మూడు లక్షల రూపాయలు వసూలు చేశాడు. నాలుగు నెలల పాటు ముంబైలో కూలీ పనులు చేసుకుంటూ స్వగ్రామానికి తిరిగి వచ్చారు. పోతారం గ్రామానికి చెందిన నలుగురు యువకుల నుంచి ఓ ఏజెంట్ డబ్బులు తీసుకుని, తీరా పయనమయ్యే ముందురోజు వీరి ఫోన్ నంబర్లను బ్లాక్ చేయడంతో మోసపోయామని గ్రహించి లబోదిబోమన్నారు. ఓ ఏజెంటు వివిధ ప్రాంతాలకు చెందిన యువకుల నుంచి సుమారు

- మిగతా 8వ పేజీలో

అప్రజాస్వామిక వాదులతో అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్న అప్రజాస్వామిక వాదుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం సాధించుకున్నప్పటికీ, నేడు దానిని కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం, మంత్రి క్యాంపు కార్యాలయంలో రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలు ఆయనకు రాఖీలు కట్టి ఆత్మీయతను చాటుకున్నారు. ఆ తర్వాత యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, బంక చందు, నాయకులు చిత్తారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్



వర్షానికి నిండుకున్న ప్రశాంత్‌నగర్ శివారులోని ఓ వ్యవసాయ బావి

మోస్తరు వర్షం

సిద్దిపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం కారణంగా శనివారం సిద్దిపేట జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. దీంతో చెరువులు, బావులు నిండాయి. అక్బర్‌పేట-భూంపల్లిలో అత్యధికంగా 42.5 మి.మీ. వర్షపాతం నమోదుకాగా, తొగుట మండలంలో అత్యల్పంగా 5.3 మి.మీ వర్షపాతం నమోదైంది. ఉదయం వర్షం కురిసినప్పటికీ, ఆ తర్వాత ఎండ పెరగడంతో ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు.



సామూహిక యజ్ఞోపవీత ధారణ

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని సిద్దిపేటలోని మార్కండేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి, మహాదేవ శివుడు, మార్కండేయ స్వామి పూజలు, హోమం జరిగాయి. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సామూహిక యజ్ఞోపవీత ధారణ శాస్త్రోక్తంగా జరిగింది. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలను మార్కెండేయ దేవాలయం నుంచి సుభాష్ రోడ్, పాత బస్టాండ్, విక్టరీ థియేటర్ చౌరస్తా మీదుగా తిరిగి ఆలయం వరకు ఊరేగించారు. ఈ పూజా కార్యక్రమాల్లో పద్మశాలి సమాజం అధ్యక్షుడు కాముని రాజేశం, ఉపాధ్యక్షులు పెద్ది అశోక్, ఇప్పకాయల శ్రీహరి, ప్రధాన కార్యదర్శి సిరిగాది బాల్‌రాజు, సహాయ కార్యదర్శి రవితేజ, చిలుక అంజనేయులు, కార్యవర్గసభ్యులు పెద్ది శ్రీనివాస్, పైరి ప్రకాష్, దీకొండ మహేష్, కొండ బత్తిని రాజ్‌కోటి, పేర్ల రాజేంద్రప్రసాద్, దండే సంతోష్ కుమార్, వీరబత్తిని నగేష్, ఆడెపు నాగరాజు, గొట్టిపాముల జలజ, సిరిమల్ సునీత, పుట్ట సునీత, సమాజం సభ్యులు పాల్గొన్నారు.

అసలే ఇరుకు.. ఆపై గుంతలు

- విస్తరణకు నోచుకోని కమలాయపల్లి, తాడూరు రోడ్డు... సింగిల్‌రోడ్డుతో అవస్థలు
- ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లతో ప్రమాదాలు
- నిధులు మంజూరైనా పనుల ప్రారంభంలో జాప్యం
- లోలెవల్ వంతెనలతో వానకాలంలో ఇబ్బందులు

చేర్యాల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి నుంచి చేర్యాల మండలం తాడూరు మీదుగా దానంపల్లి వరకు ఉన్న సింగిల్ లేన్ రోడ్డు అధ్వానంగా మారింది. ఈ దారిలో ప్రయాణించాలంటే స్థానికులు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. రోడ్డు విస్తరణ కోసం ఆరు నెలల క్రితం రూ.6.12 కోట్లు మంజూరైనా, టెండర్ల ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పనుల ప్రారంభంపై అనిశ్చితి నెలకొంది. కొన్నేళ్ల క్రితం వేసిన ఈ బీటీ రోడ్డు నిర్వహణ లేకపోవడంతో పూర్తిగా ధ్వంసమైంది. గుంతలు, మూలమలుపులతో ప్రయాణం కష్టంగా మారింది. అంతేకాకుండా, రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు దారిని కప్పేస్తున్నాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇరుకైన దారిలో ఒక వాహనం వస్తే, మరొకటి ఆగిపోవాల్సిన పరిస్థితి. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రమాదాలకు దారితీస్తోంది. గతంలో వాహనాలు బోల్తాపడి పలువురు గాయపడిన సంఘటనలూ ఉన్నాయి.

వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం

తాడూరు గ్రామ శివారులోని లోలెవల్ కాజ్‌వేపై వర్షాకాలంలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప్రయాణికులు

- మిగతా 8వ పేజీలో



రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన మొక్కలు, ధ్వంసమైన రోడ్డు



హబ్షీపూర్ గురుకుల కళాశాలను సందర్శింస్తున్న కలెక్టర్

ఇంత నిర్లక్ష్యమా..?

- భూంపల్లి ఆసుపత్రి సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం

దుబ్బాక/మిరుదొడ్డి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నిరంతర వైద్య సేవలు అందించాల్సిన ఆసుపత్రిలో సిబ్బంది నిర్లక్ష్యంపై జిల్లా కలెక్టర్ హైమవతి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం రాత్రి కలెక్టర్ హైమవతి దుబ్బాక మండలం హబ్సిపూర్‌లోని జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా అని పరిశీలించి, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి పీహెచ్‌సీని సందర్శించారు. 24 గంటలు సేవలందించాల్సిన ఆసుపత్రిలో ఆయా, పీహెచ్‌సీ ఫీల్డ్ నర్స్, వాచ్‌మెన్ మినహా ఎవరూ లేరు. దీనిపై కలెక్టర్ సిబ్బందిని ప్రశ్నించారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించి, సెలవు పత్రాలు రాత్రి అత్యవసర సేవలకు రోగులు వస్తే ఎవరు చికిత్స చేస్తారని నిలదీశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య అధికారిని ఆదేశించారు.



రామచంద్రాపురం టౌన్ : సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కడుతున్న రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పానగేష్



కేటీఆర్‌కు రాఖీ కడుతున్న భారతీనగర్ కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి



మునిపల్లి : మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు రాఖీ కడుతున్న మునిపల్లి మాజీ జడ్పీటీసీ మీనాక్షి

అనుబంధాల రక్షాబంధన్



హుస్నాబాద్: పంచపాండవుల పుష్పాలతో రాఖీలు కడుతున్న కూతుళ్లు

అనుబంధాలకు ప్రతీక రక్షాబంధన్ అని పలువురు పేర్కొన్నారు. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని పలు మండలాల్లో రాఖీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. చెల్లెలు అన్నలకు రాఖీలు కట్టి తమ ప్రేమాభిమానాలు చాటుకున్నారు. అనంతరం వారి ఆశీర్వాదం తీసుకున్నారు. రాఖీ పండుగ సందర్భంగా ఆడపడుచులు పుట్టింటికి రావడంతో ఇళ్లల్లో సందడి నెలకొన్నది.

- న్యూస్ నెట్‌వర్క్



హుస్నాబాద్: పంచ పాండవుల పుష్పాలు

వీర జవాన్ విగ్రహానికి రాఖీ కట్టిన అక్కాచెల్లెళ్లు



నరసింహానాయక్ విగ్రహానికి రాఖీలు కడుతున్న సోదరీమణులు

అక్కన్నపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ పండుగ. అయితే తన సోదరుడు చనిపోయినా అతని విగ్రహానికి రాఖీలు కట్టి అన్నాచెల్లెళ్ల అనుబంధం ఎంత గొప్పదో చాటి చెబుతున్నారు వీర జవాన్ నరసింహనాయక్ సోదరీమణులు. శనివారం రాఖీ పౌర్ణమి కావడంతో సోదరుడి విగ్రహానికి రాఖీలు కట్టారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం దుబ్బతండా గ్రామ పరిధిలోని రాజుతండాకు చెందిన గుగులోతు లింగయ్య-సత్యవ్వలకు నరసింహనాయక్‌తో పాటు ముగ్గురు కుతుళ్లు. అతడు సీఆర్పీఎఫ్ జవానుగా పనిచేస్తూ 2014లో ఛత్తీస్‌ఘడ్‌లో నక్సల్స్ మందుపాతరలో మృతిచెందాడు. అతని జ్ఞాపకార్థం తల్లిదండ్రులు నరసింహనాయక్ విగ్రహం ఏర్పాటు చేశారు. ఒక్కగానొక్క సోదరుడు చనిపోవడంతో తాము రాఖీ ఎవరి కట్టాలని సోదరీమణులు బాధపడ్డారు. విగ్రహంలోనే తమ తమ్ముడిని చూసుకుంటూ ఏటా రాఖీ కట్టి పండుగ జరుపుకుంటున్నారు. ప్రతి సంవత్సరం స్వాతంత్ర్య గణతంత్ర దినోత్సవ వేడుకల రోజు తండ్రి లింగయ్య జాతీయ జెండాను ఎగురవేస్తున్నాడు.

క్రైం కార్నర్

రాఖీ కట్టేందుకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం

● కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. యువతి మృతి

సిద్దిపేట క్రైం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తల్లితో కలిసి రాఖీ కట్టేందుకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతి మృత్యువాత పడింది. వారు ప్రయాణిస్తున్న కారు టైరు పగలడం.. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. చిన్నకోడూరు మండలం గోనెపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి పల్లవి కుటుంబం గజ్వేల్‌లో స్థిరపడింది. శనివారం సిద్దిపేటలో ఉంటున్న తన తమ్ముడికి రాఖీ కట్టేందుకు కుమార్తె శృతి(25)తో కలిసి వచ్చింది. సిద్దిపేటలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న నాగిళ్ల శ్రీనివాస్ ఇంటికి వారు రాగా, నాగిళ్ల శ్రీనివాస్ భార్యను, అక్కా పల్లవి, కోడలు శృతిని తీసుకుని టీఎస్ 09 ఎస్ఏ 8304 నెంబర్ కారులో అత్తాగారి ఊరైన అల్లిపూర్‌కు వెళ్లారు. అక్కడ భార్యను వదిలి ముగ్గురు కలిసి నాగిళ్ల శ్రీనివాస్ స్వగ్రామమైన నర్మెటకు రాఖీ కట్టేందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో నర్సాపూర్ చౌరస్తా కారు టైరు పగిలిపోయింది. కారు నెమ్మదించిన నేపథ్యంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కరీంనగర్ -1 డిపోకు చెందిన టీజీ 02 0023 నెంబర్ గల ఆర్టీసీ రాజధాని ఎక్స్‌ప్రెస్ కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో వెనుక కూర్చున్న శృతి తలకు తీవ్ర గాయాలయ్యాయి. టూ టౌన్ పోలీసులు వెంటనే వచ్చి గాయపడిన శృతిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె మృతి చెందింది. ప్రమాదంలో పల్లవికి స్వల్ప గాయాలు అయ్యాయి. శృతి బీటెక్ పూర్తి చేసి, ఉద్యోగం చేస్తోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



శృతి(ఫైల్)

బైక్ పైనుంచి పడి మహిళ మృతి

ములుగు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : బైక్ పైనుంచి పడి మహిళ మృతిచెందిన సంఘటన ములుగు మండలం తునికిబొల్లారం గ్రామంలో చోటుచేసుకుంది. శనివారం ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బక్క భారతి(40) లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రిలో హౌస్‌కీపర్‌గా పనిచేస్తుంది. శుక్రవారం రాత్రి పని ముగించుకుని కుమారుడి బైక్‌పై వస్తున్నది. గ్రామ సమీపంలోకి రాగానే తల తిరిగి బైక్ పైనుంచి కిందపడింది. తలకు బలమైన గాయం కావడంతో కుటుంబసభ్యులు వెంటనే ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతిచెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

భూ తగాదాలతో వ్యక్తి ఆత్మహత్య



మల్లేషం(ఫైల్)

రాయపోల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు చేసిన భూమిని అమ్మిన వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాయపోల్ మండలం మంతూరులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చెలిమెల మల్లేశం(49) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పదేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన రిమ్మనగూడ బొందవ్వ వద్ద 2 ఎకరాల 12 గుంటల భూమిని కొనుగోలు చేశాడు. భూమిని రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో గ్రామంలో పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడినప్పటికీ బొందవ్వ భూమిని రిజిస్ట్రేషన్ చేయలేదు. తమకు భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా కొందరు అడ్డుపడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మల్లేశం శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య చెలిమెల లక్ష్మి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మానస తెలిపారు.

పండుగ పూట విషాదం

● గుండెపోటుతో యువకుడి మృతి



ఎంబరి రవి(ఫైల్)

నారాయణఖేడ్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సంజీవన్‌రావుపేటలో శనివారం రాఖీ పండుగ పూట విషాదం నెలకొంది. గుండెపోటుతో ఓ యువకుడు మృతిచెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎంబరి రవి(34) శనివారం ఉదయం తన నివాసంలో అకస్మాత్తుగా గుండెపోటుతో కుప్పకూలాడు. కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం ఖేడ్ ఏరియా వైద్యశాలకు తీసుకురాగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడికి భార్య ఉమ, మూడేళ్లలోపు కుమారుడు, కూతురు ఉన్నారు. రవి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

● చిట్కుల్ గ్రామంలో ఘటన

చిలప్‌చెడ్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన చిలప్‌చెడ్ మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన బోయిని కిష్టయ్య(65) శుక్రవారం ఉదయం పత్తి పంటకు మందు పిచికారీ చేశాడు. అనంతరం అదే గ్రామానికి చెందిన చెర్ల కిష్టయ్యతో కలిసి గ్రామంలో మద్యం సేవించాడు. చెర్ల కిష్టయ్య బోయిని కిష్టయ్యను మధ్యాహ్నం 1 గంట సమయంలో గ్రామంలోని ఉన్నత పాఠశాల ముందు గల కల్వర్టుపై దించి వెళ్లాడు. ఆ వైపుగా వస్తున్న బోయిని నాగరాజు గమనించగా.. బోయిని కిష్టయ్య గాఢ నిద్రలో ఉన్నాడు. సాయంత్రం 4 గంటలకు కిష్టయ్య కుమారుడు మల్లేశం వెళ్లి చూడగా.. మృతిచెంది ఉన్నాడు. తన భర్త మృతిపై అనుమానం ఉన్నదని, విచారణ జరపాలని భార్య లచ్చమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వినాయక చవితికి విగ్రహాలు సిద్ధం

● ఆధునిక డిజైన్లతో ఆకట్టుకునే విధంగా..
● 12 అడుగుల వరకు విగ్రహాలు అందుబాటులో..

నారాయణఖేడ్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి పర్వదినం సమీపిస్తుండడంతో విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. మారుతున్న కాలానుగుణంగా ఆధునిక డైజన్లతో ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దుతున్నారు. 12 అడుగుల వరకు విగ్రహాలు అందుబాటులో ఉన్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. గతంలో హైదరాబాద్, నిజామాబాద్ ప్రాంతాల నుంచి విగ్రహాలను తెచ్చుకునే వారు. ప్రస్తుతం పోటీపడి విగ్రహాలను ఏర్పాటు చేస్తుండడంతో 6, 7 ఏళ్లుగా రాజస్థాన్ కళాకారులతో కొందరు తయారు చేయించి విక్రయిస్తుండగా, మరికొందరు ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి ఇక్కడికి తెచ్చి విక్రయిస్తున్నారు.

ఖేడ్‌లో 30 దుకాణాలు

ప్రస్తుతం నారాయణఖేడ్‌లో 30 వరకు విగ్రహాల దుకాణాలు వెలిశాయి. దాదాపు రెండు ఫీట్ల నుంచి 12 ఫీట్ల ఎత్తుగల విగ్రహాలు వివిధ రకాల భంగిమళలలో సిద్ధంగా ఉన్నాయి. విగ్రహం డిజైన్‌ను బట్టి రూ.2 వేల నుంచి రూ.30 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇప్పటికే నిర్వాహకులు తమకు అవసరమైన విగ్రహాలను విక్రయదారుల వద్ద ఎంపిక చేసుకొని అడ్వాన్సులు ఇచ్చి వెళ్తున్నారు. నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో దాదాపు 1000 వరకు మండపాలు ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల పర్యావరణ సమస్య తలెత్తుతుందని భావించేవారు మట్టి గణపతులను కూడా ప్రతిష్టించుకునే విధంగా వాటిని కూడా ప్రత్యేకంగా విక్రయిస్తున్నారు. మట్టి వినాయకులు స్థానికంగా 2 నుంచి 4 అడుగుల వరకు లభిస్తున్నాయి. ఈ విగ్రహాలు రూ.4 వేల నుంచి రూ.12 వేల వరకు విక్రయిస్తున్నారు. ప్రత్యేకంగా కోల్‌కత్తా మోడల్‌లో మట్టి వినాయకులను స్థానికంగానే తయారు చేస్తున్నారు. ఏదేమైనా వినాయక చవితి సమీపిస్తుండడంతో విగ్రహాల విక్రయాల దుకాణాల వద్ద సందడి నెలకొంది.



ఖేడ్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, వినూత్నంగా శివలింగాన్ని కౌగిలించుకుంటున్న మట్టి వినాయకుడు

మహారాష్ట్ర నుంచి విగ్రహాలు తీసుకొచ్చాం

తాము మహారాష్ట్ర నుంచి విగ్రహాలను విక్రయానికి తీసుకొచ్చాం. మా వద్ద 4 నుంచి 10 ఫీట్ల వరకు వంద విగ్రహాలను సిద్ధం చేసి ఉంచాం. గతంలో నిర్వాహకులు విగ్రహాలను ఇతర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసాలకు ఓర్చి తెచ్చుకునేవారు. తాము స్థానికంగా అందుబాటులోఉంచడంతో ఉత్సవ నిర్వాహకులకు ఇబ్బంది లేకుండా ఉంది.

- రాంబాబు, విక్రయదారుడు

తోటపల్లిలో శతాధిక వృద్ధురాలు మృతి



గాజుల వరవ్వ (ఫైల్)

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామానికి చెందిన గాజుల వరవ్వ(104) శనివారం అనారోగ్యంతో మృతిచెందింది. వరవ్వకు నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. తోటపల్లిలో గ్రామస్థులు, కుటుంబసభ్యులు శతాధిక వృద్ధురాలి అంత్యక్రియలు ఘనంగా జరిపించారు.

మల్లికార్జున్‌పల్లిలోకి అడవి పంది హల్‌చల్

● వలేసి పట్టుకున్న గ్రామస్థులు
● ఊపిరి పీల్చుకున్న ప్రజలు



అడవి పందిని పట్టుకున్న పొండు

మునిపల్లి, ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మల్లికార్జున్‌పల్లి గ్రామంలో కొన్ని రోజులుగా అడవి పందులు హల్‌చల్ చేస్తున్నాయి. శనివారం గ్రామంలో గల కొత్త కాలనీలో ఊరిలో ఉండే పందులతో కలిసి హాయిగా పడుకున్నది. దీన్ని గమనించిన గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. ఎలాగైనా పట్టించాలని గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల పొండుకు చెప్పారు. అతడు తన వద్ద ఉన్న వలను కట్టి అడవి పందిని పట్టుకున్నాడు. దీంతో గ్రామస్థులంతా ఊపిరి పీల్చుకున్నారు.

పరిశ్రమలో గోడ కూలి ఒకరు మృతి

● మరొకరికి గాయాలు.. కంపెనీ నిర్లక్ష్యం వల్లేనని ఆందోళన
● రాఖీ పండుగ రోజు విషాదం



బాల్‌రెడ్డి (ఫైల్)

మనోహరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలో పని చేస్తుండగా గోడ కూలి ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ పారిశ్రామిక వాడలో చోటు చేసుకుంది. రాఖీ పండుగ రోజు విషాదం నింపిన ఈ ఘటన సంబంధిన వివరాలు ఇలా ఉన్నాయి. కాళ్లకల్ పారిశ్రామికవాడలోని రామ స్పిన్నింగ్ మిల్లు ప్రైవేట్ లిమిటెడ్‌లో మనోహరాబాద్‌కు చెందిన తమ్మరెడ్డి బాల్‌రెడ్డి(56), కాళ్లకల్ గ్రామానికి చెందిన గానుగు రవి(43)లు ఎలక్ట్రిషియన్లుగా పని చేస్తున్నారు. ఇద్దరూ శనివారం పరిశ్రమలో వాటర్ ట్యాంక్ వద్ద ట్యాంకు నింపుతుండగా, ఒక్కసారిగా గోడ కూలి బాల్‌రెడ్డిపై పడింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. పక్కనే ఉన్న గానుగు రవిపై కూడా గోడ పడటంతో కాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో ఆయనను పరిశ్రమ సిబ్బంది నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. బాల్‌రెడ్డి ఈ కంపెనీలో 26 సంవత్సరాల నుంచి ఎలక్ట్రిషియన్‌గా పని చేస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్నకుమారుడు సందీప్‌రెడ్డి అమెరికాలో ఉన్నాడు. కంపెనీలో ప్రమాదం జరిగిందన్న సమాచారం అందిన వెంటనే బాల్‌రెడ్డి బంధువులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. కంపెనీ నిర్లక్ష్యం వల్లే బాల్‌రెడ్డి చనిపోయాడని ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేసేవరకు మృతదేహన్ని తరలించేది లేదని భీష్మించుకూర్చున్నారు. మనోహరాబాద్, తూప్రాన్ ఎస్సైలు శివనందం, సుభాష్‌గౌడ్, తూప్రాన్ డివిజన్ బెటాలియన్ పోలీసులు వచ్చి బందోబస్తు నిర్వహించారు. కంపెనీ బాధ్యులు వచ్చి న్యాయం చేసే వరకు కదిలేది లేదని సాయంత్రం వరకు అక్కడే కూర్చున్నారు. పోలీసులు వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించగా, వాగ్వాదానికి దిగారు.



సంఘటనా స్థలం వద్ద బైఠాయించిన గ్రామస్థులు, కుటుంబీకులు

మహిళను చెట్టుకు కట్టేసి.. కొట్టి..

● దంపతుల దాష్టికం



మహిళను చెట్టుకు కట్టేస్తున్న దృశ్యం

మర్కుక్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వెళ్తున్న మహిళ తమను దూషించిందంటూ ఆమెను చెట్టుకు కట్టేసి సుమారు అర గంట పాటు కొట్టారు. ఈ ఘటన జరుగుతున్న సమయంలో గ్రామస్థులు చూస్తూ నిలబడ్డారే తప్ప ఆమెను విడిపించే ప్రయత్నం చేయలేదు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం చేబర్తి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బొమ్మని లక్ష్మి దళితురాలు. భర్త, పిల్లలు లేరు. ఒంటరిగా ఉండే ఆమె శనివారం రోడ్డుమీదుగా దూషించుకుంటూ వెళ్తోంది. తమనే దూషిస్తోందని గ్రామానికి చెందిన సత్యనారాయణ, రేణుక అనే దంపతులు బొమ్మని లక్ష్మిని పట్టుకుని చెట్టుకు కట్టేసి కొట్టారు. తాగిన మైకంలో ఆమె తమనే దూషించిందని వారు ఆరోపిస్తూ.. ఎందుకు దూషిస్తున్నావంటూ కొట్టారు. గ్రామంలో దుర్గమ్మ ఆలయ నిత్య పూజారులైన ఈ దంపతులు ఆమెను కొడుతుండగా, అక్కడికి వచ్చిన గ్రామస్థులు చూస్తూ ఉన్నారే తప్ప విడిపించే ప్రయత్నం చేయలేదు. విషయం తెలిసి గ్రామంలోనే ఉన్న లక్ష్మి సోదరుడు హుటాహుటిన వచ్చి ఆమెను విడిపించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దళిత మహిళను చెట్టుకు కట్టేసి కొట్టిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి, బాధితురాలికి న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పెళ్లిలో రాఖీ కౌంటర్



పెళ్లిలో రాఖీల సౌకర్యం

రామచంద్రాపురం టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం తెల్లాపూర్‌లో శనివారం జరిగిన ఓ పెళ్లి ప్రత్యేకంగా రాఖీ కౌంటర్ ఏర్పాటు చేశారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా పెళ్లికి వచ్చే బంధువులు రాఖీలు కట్టడానికి వీలుగా రాఖీలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ ఆకర్షణగా నిలిచింది.

ప్రకృతిని ప్రేమిద్దాం

● మొదలైన ఎన్ఎస్‌పీఈస్ 2025 రిజిస్ట్రేషన్లు
● ఈకో మిత్రం ఆప్ ద్వారా ఆగస్టు 21 వరకు నమోదుకు అవకాశం
● పాల్గొననున్న లక్షలాదిగా నేచర్ లవర్స్

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : 'ఈ ప్రకృతిలో ఏదీ మనం సొంతం కాదు. మనం భూమి మీద టెన్నెంట్స్ మాత్రమే. కొన్నాళ్లు ఉండటానికి వచ్చాం. అలాగే ఉండి ఏది డిస్టర్బ్ చేయకుండా వెళ్లిపోదాం. తర్వాత తరానికి ఉన్నది ఉన్నట్లుగా ఇచ్చేయాలి.' ఇది ఓ తెలుగు సినిమాలో డైలాగ్. ప్రస్తుతం ప్రకృతి విధ్వంసం చూస్తే.. ఆ మూవీ డైలాగ్‌ను తూచ తప్పకుండా పాటించాల్సిందేనని అనిపిస్తున్నది. దాదాపు 200 ఏళ్లలో జరిగిన ప్రకృతి విధ్వంసం కొన్ని మిలియన్ సంవత్సరాల్లో ఎప్పుడూ జరగలేదంటున్నారు పర్యావరణ ప్రేమికులు. విరివిగా ప్లాస్టిక్ వాడటం, డిస్పోజబుల్స్, శిలాజ ఇంధనాలను వాడటం, పొల్యూషన్, అడవులను నరికివేయటం వంటి మానవ తప్పిదాల వల్ల ప్రకృతికి పూడ్చలేని లోటును ఎదుర్కొనబోతుందంటున్నారు.

ఎన్ఎస్‌పీఈస్ ఆన్‌లైన్ క్విజ్ కాంపీటిషన్

వాతావరణ మార్పుల పర్యవసానాల నుంచి రక్షణకు విద్యార్థుల్లో పర్యావరణ నైపుణ్యాలు, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవటం, మొక్కలు నాటడం, నీటి సంరక్షణ, వ్యర్థాలను వేరుచేయటం వంటి అంశాల్లో అవగాహన అవసరం. విద్యార్థి దశ నుంచే వీటిపై అవేర్‌నెస్ పెంచాలనే ఉద్దేశంతో 'హరిత్ ద వే ఆఫ్ లైఫ్' అనే థీమ్‌తో దేశవ్యాప్తంగా ఎన్ఎస్‌పీఈస్ 2025 (నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ కాంపిటీషన్)ను కేంద్ర విద్యా, పర్యావరణ మంత్రిత్వ శాఖల సహకారంతో పర్యావరణ గతివిధి (పీఎస్‌జీ) నిర్వహిస్తుంది. జూలై 1 నుంచి ఆగస్టు 21 వరకు ఆసక్తి ఉన్నవారు రిజిస్ట్రేషన్లు చేసుకొని ఆన్‌లైన్ క్విజ్ పోటీలో పాల్గొనాలి. ఈ ఫలితాలు ఆగస్టు 31 ప్రకటిస్తారు. ఈకో మిత్రం అనే మొబైల్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. హిందీ, ఇంగ్లీష్ సహా పలు భాషల్లో క్విజ్‌లో పాల్గొనవచ్చు. మొక్క నాటుతున్న, నీరు సేవ్ చేస్తున్న లేదా వ్యర్థాలను వేరు చేస్తున్న సెల్ఫీని తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. పాల్గొన్న ప్రతీ విద్యార్థికి ఈ సర్టిఫికెట్ అందజేస్తారు.



ఎన్ఎస్‌పీఈస్ 2025 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హైమావతి, జిల్లా విద్యాశాఖ అధికారులు(ఫైల్)

ఐదు విభాగాల్లో పోటీ

ఈ క్విజ్ పోటీలో మొదటి విభాగంలో 1 నుంచి 5వ తరగతి, రెండో విభాగంలో 6 నుంచి 8వ తరగతి, మూడో విభాగంలో 9 నుంచి 12వ తరగతి, నాల్గవ విభాగంలో డిగ్రీ, పీజీ, పరిశోధన విద్యార్థులు, ఐదో విభాగంలో ఇతరులు సాధారణ పౌరులు, పర్యావరణ ప్రేమికులు పాల్గొనవచ్చు. దేశవ్యాప్తంగా నాలుగేళ్లుగా లక్షలాది మంది ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. జిల్లా నుంచి ఈసారి పెద్దఎత్తున పాల్గొనేలా విద్యాశాఖ అధికారులు అవేర్‌నెస్ కార్యక్రమాలు చేపడుతున్నారు. తాజాగా ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ హైమావతి ఆవిష్కరించారు.



ములుగులో తమ్మునికి రాఖీ కడుతున్న అక్కలు

అనుబంధాల రాఖీ

న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అక్కాచెల్లెల, అన్నదమ్ముల అనుబంధమే రాఖీ పండుగ. ఈ రక్షాబంధన్‌ని జిల్లాలో ఘనంగా జరుపుకున్నారు. అన్నా, చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఆశాజ్యోతిలో రక్షా బంధన్ వేడుకలను యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షారెడ్డి ఘనంగా నిర్వహించారు.



పూజల హరికృష్ణకు రాఖీ కడుతున్న ముస్లీం సోదరి



జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ దంపతులకు రాఖీ కడుతున్న సోదరి



ట్రాఫిక్ పోలీసులకు రక్షా బంధన్ కడుతున్న యువతి

మాట్లాడే ముందు తస్మాత్ జాగ్రత్త

● కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్



బాల సదనంలో విద్యార్థినులకు పుస్తకాల అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడే ముందు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, లేకుంటే తస్మాత్ జాగ్రత్త అని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ హెచ్చరించారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని బాలసదనంలో రాఖీ పండుగ సందర్భంగా విద్యార్థినుల చేత కాంగ్రెస్ నాయకులకు రాఖీ కట్టారు. కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు గయాజుద్దీన్ ఎగ్జామ్ ప్యాడ్, నోట్‌బుక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా అత్తుఇమామ్ మాట్లాడుతూ మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిని విమర్శించే స్థాయి నీకు లేదని, నీ హోదాకు తగ్గట్లు మాట్లాడితే బాగుంటుందని సూచించారు. పదేళ్ల పాటు ప్రజలు అధికారమిస్తే ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు గ్యాదరి మధు, గాయాజుద్దీన్, అర్షద్ హుస్సేన్, బాబా, వట్టిపల్లి రాజిరెడ్డి, ఫయాజ్, జఫర్ తదితరులు పాల్గొన్నారు.

దళిత మంత్రులపై మొసలికన్నీరు



అక్బర్‌పేటలో మాట్లాడుతున్న బక్కివెంకటయ్య

మిరుదొడ్డి, ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ బద్ధ పదవిలో ఉన్న సామాన్యుడైన తనపై విషం కక్కడం సరికాదని, దళిత మంత్రులపై ఆరోపణలను ఖండిస్తూ కాంగ్రెస్‌పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మొసలికన్నీరు కారుస్తున్నారని రాష్ట్రఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శనివారం అక్బర్‌పేటలో ఆయన మాట్లాడారు. మొదటి నుంచి తనపై లేనిపోని విమర్శలను చేస్తూ నాపై విషం కక్కుతున్నారని మండిపడ్డారు. రాజకీయాలు శాశ్వతం కావని, హుందాగా వ్యవహరించాలని సూచించారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డితోనే కాకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్రమంత్రులతో కూడా పర్యటిస్తామని స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్, గవర్నర్ పర్యటనలో పాల్గొన్నానని, చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి మాత్రం దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి పర్యటన మాత్రమే కనబడుతుందని విమర్శించారు. రాష్ట్ర ఎస్సీఎస్టీ కమీషన్ చైర్మన్‌గా దళిత అభ్యున్నతికోసం పాటుపడుతున్నానని తెలిపారు. తనపై ఇప్పటికైనా విమర్శలను మానుకోవాలని, లేనియెడల ప్రజలు బుద్ధిచెప్తారని పేర్కొన్నారు.

రోడ్లపై ప్రయాణికుల రద్దీ

కొండపాక,ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాఖీ పండుగ సందర్భంగా దూర ప్రాంతాల నుంచి తమ తమ సోదరులకు రాఖీ కట్టడం కోసం గ్రామాలకు వెళ్తుండడంతో రహదారులన్ని ప్రజలతో రద్దీగా మారాయి. కొండపాక మండలం వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద సిద్దిపేట హైదరాబాద్ రాజీవ్ రహదారి, వెలికట్ట క్రాస్ రోడ్ నుంచి చేర్యాల, జనగాం రోడ్డు రద్దీగా మారింది. వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద కూడలి కావడంతో అటు హైదరాబాద్, ఇటు వైపు చేర్యాల వెళ్లేవారు బస్సుల కోసం వేచి చూస్తుండడంతో శనివారం సాయంత్రం రద్దీగా మారింది.



వెలికట్ట క్రాస్ రోడ్ కూడలి వద్ద ప్రయాణీకుల రద్దీ

బీఆర్ఎస్ సోషల్‌మీడియా వారియర్‌పై లాఠీ

చేర్యాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్‌డ్రైవ్‌తో పట్టుబడిన చేర్యాల మండలం గుర్జకుంట గ్రామానికి చెందిన సోషల్‌మీడియా వారియర్ దర్శనం సురేందర్‌పై పోలీసులు లాఠీ ఝుళిపించారు. దీంతో అతడికి గాయాలై ఈ సంఘటన వివాదాస్పదంగా మారింది. ఈమేరకు శనివారం బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొండపాక మండలం కంబాలపల్లి గ్రామంలోని తమ బంధువు శుక్రవారం చనిపోవడంతో సురేందర్ అంత్యక్రియలకు హాజరై బైక్‌పై సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్నాడు. మారమధ్యంలో గుర్జకుంట గ్రామశివారులో చేర్యాల ఎస్సై నవీన్ పోలీసు సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో సురేందర్ బైక్‌ను నిలిపి డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ చేశారు. తమ బంధువు చనిపోవడంతో అంత్యక్రియలకు హాజరై మద్యం సేవించినట్లు అంగీకరించాడు. సురేందర్ సెల్‌ఫోన్ లాక్కోవడంతో పోలీసులను ప్రశ్నిస్తూ వాగ్వాదానికి దిగాడు. దీంతో ఎస్సై నవీన్ లాఠీతో బాదడంతో తొడ వెనక భాగంలో బొబ్బలు వచ్చాయి. ఈవిషయమై ఉన్నతాధికారులు న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఈవిషయమై ఎస్సై నవీన్‌ను వివరణ కోరగా డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన సురేందర్ తాగిన మైకంలో తీవ్రంగా న్యూసెన్స్ చేశాడని, కొద్దిసేపటి తరువాత అతడి మిత్రుడు కూడా వచ్చి న్యూసెన్స్ చేయడంతో లాఠీతో బాదినట్లు తెలిపారు.



తొడపై బొబ్బలు

ఘనంగా శ్రావణ పౌర్ణమి వేడుకలు



మంగళగౌరి గా దర్శనమిచ్చిన విజయదుర్గా మాత

కొండపాక, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని శ్రీ విజయ దుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శనివారం శ్రావణ పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో సంతాన మల్లికార్జున స్వామికి, విజయ దుర్గా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయదుర్గా మాత శ్రావణ గౌరిగా భక్తులకు దర్శనం ఇచ్చింది. అనంతరం విజయ దుర్గా నవావరణ హవనం నిర్వహించారు.సువాసినులు లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం చేశారు.అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు మోహన కృష్ణ శర్మ, వేదవ్యాస్, క్రిష్ణ , కిశోర్ పాండే, మల్లికార్జున్, రాజశేఖర వర్మ, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సంతోషీమాత ఆలయంలో విశేషపూజలు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషీమాత దేవాలయంలో రక్షా బంధన్ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం రాఖీ పౌర్ణమి, శ్రీ సంతోషీమాత అమ్మవారి జన్మ నక్షత్రం పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. అమ్మవారికి అభిషేకం, పుష్పాలంకరణ చేశారు. అమ్మవారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారికి డోలోత్సవం, రక్షా బంధనం కార్యక్రమం నిర్వహించారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

కొమురవెల్లి/సిద్దిపేట రూరల్/జగదేవ్‌పూర్/సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులు రైతు బీమా నమోదు చేసుకోవాలని జిల్లా అధికారులు పేర్కొంటున్నారు. సిద్దిపేట వ్యవసాయ శాఖ అధికారి స్వరూప రాణి మాట్లాడుతూ ఈ బీమాకు 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల లోపు వయసు గల రైతులు బీమా నమోదు కోసం రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, రైతు నామిని ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలతో తమ వ్యవసాయ విస్తరణ అధికారులు స్వయంగా సంప్రదించాలన్నారు. జూన్ 5 నాటికి కొత్త పట్టాదారు పాస్‌బుక్స్ పొందిన రైతులు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.



జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూప రాణి

వలస పక్షులపై ఏజెంట్ల వల..!

(5వ పేజీ తరువాయి)

రూ.37 లక్షలు వసూలు ఉడాయించాడు.

జిల్లా నుంచి 27 వేల మంది..!

జిల్లా నుంచి ఎంతమంది వలస వెళ్లారనే లెక్కలు నిర్దిష్టంగా ప్రభుత్వం వద్ద లేనప్పటికీ, సకలజనుల సర్వేలో సుమారు 27 వేల మంది స్థానికంగా అందుబాటులో లేరని తేలింది. ఈ ప్రాంతం నుంచి ఎక్కువ మంది ఉపాధి కోసం దుబాయ్, సౌదీ అరేబియా, ఖతార్, కువైట్, బెహ్రెయిన్, మలేషియా, రియాద్ వంటి దేశాలకు వెళ్తుంటారు.

విద్యార్హతలు లేకపోవడంతో ఆసక్తి

గల్ఫ్‌తోపాటు వివిధ దేశాలకు వెళ్లేవారికి విద్యార్హతలు లేకపోవడంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ జీతం పొందవచ్చనే ఆశతో చాలా మంది వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. అక్కడికి వెళ్లాకా యజమాన్యాలు కార్మికుల పాస్‌పోర్ట్‌లు, ఇతర ముఖ్యమైన పత్రాలు యజమాని దగ్గరే ఉంచుకుని బందీలుగా మార్చి వెట్టిచాకిరీ చేయిస్తారు. ముందుగా చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం.. తక్కువ వేతనం, ఏళ్ల కొద్ది అక్కడే పని చేయాల్సి ఉంటుంది. దీంతో దిక్కుతోచని స్థితిలో చాలామంది జీవోచ్ఛవంలో జీవనం గడుపుతున్నారు. ఇదంతా భరించలేని కొందరు బలవన్మరణాలకు పాల్పడటం, లేదా ప్రతిఘటించి ఏదో ఒక కేసుల్లో జైళ్లపాలవడమో జరుగుతున్నది.

ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

దేశం నుంచి వలస వెళ్లిన వారి సంఖ్యపై ప్రభుత్వం వద్ద సరైన లెక్కలు లేవని విమర్శలు వినిపిస్తున్నాయి. గల్ఫ్ కార్మికుల కోసం గల్ఫ్ పాలసీని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, అది ప్రజల్లోకి వెళ్లలేదని అంటున్నారు. దుబ్బాక మండలంలోనే 50 మంది మోసపోయారంటే రాష్ట్రవ్యాప్తంగా ఎంతమంది ఉంటారోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినా ప్రభుత్వాలు ఏజెంట్ల మోసాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.

పని చేయించుకుని జీతం ఇవ్వలేదు



విజయవాడకు చెందిన ఒక ఏజెంట్ ఆఫ్రికాలోని లినింగో స్టేట్‌లో కోడిగుడ్ల రవాణా పని ఇప్పిస్తానని రూ.2లక్షలు తీసుకున్నాడు. అక్కడ పని చేయించుకున్నా, ఒక్కపైసా కూడా జీతం ఇవ్వలేదు. నా పాస్‌పోర్టు గుంజుకున్నారు. 50 వేలు తిరిగి ఇస్తే, పాస్‌పోర్టు ఇచ్చారు. ఇంటికి రావడానికి రూ.లక్ష ఖర్చు అయింది.

- కోమటిరెడ్డి నవీన్‌రెడ్డి, రాజక్కపేట

ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి, ఏటా బడ్జెట్ కేటాయించాలి. స్వదేశానికి తిరిగి వచ్చిన కార్మికులకు స్వయం ఉపాధి కల్పించడంతోపాటు ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలి. గల్ఫ్ జైళ్లలో ఉన్న కార్మికులకు న్యాయ సహాయం కోసం ప్రవాసీ భవన్‌ను ఏర్పాటు చేయాలి. విదేశాలకు వెళ్లేవారికి నైపుణ్య శిక్షణతోపాటు, ఆయా దేశాల చట్టాలపై ప్రభుత్వం అవగాహన కల్పించాలి.

- నరేంద్ర పన్నీరు, గల్ఫ్ ఫ్రెండ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు

డిపాజిట్‌రానోడుకూడా విమర్శలా..?

● చెరుకు శ్రీనివాస్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకో

దుబ్బాక, అగస్టు10(ఆంధ్రజ్యోతి): సీజన్‌కోసారి పార్టీలుమారి, అసెంబ్లీ ఎన్నికల్లో డిపాజిట్‌రానోళ్లు కూడా ఓటమి ఎరుగని నాయకుడు కొత్తప్రభాకర్‌రెడ్డిని విమర్శలు చేయడం సిగ్గుచేటని, చిల్లర మాటలతో కాంగ్రెస్‌పార్టీ పరువులేకుండా చేస్తున్న ఆయనకు జీవితంలో కూడా ప్రజలు ఓట్లేయరనీ దుబ్బాక బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. శనివారం బీఆర్ఎస్ నాయకులు ఎల్లారెడ్డి, ఆస స్వామి, తౌడశ్రీనివాస్, ర్యాకం శ్రీనివాస్, పల్లెరామస్వామి, ఇల్లెందుల శ్రీనివాస్, మల్లెశంగౌడ్‌లు విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డిపై మండిపడ్డారు. తండ్రిపేరును అడ్డంపెట్టుకుని రాజకీయాలకు వచ్చిన శ్రీనివాస్‌రెడ్డి ఎన్ని జన్మలెత్తినా నాయకుడు కాలేడని ఏద్దేవా చేశారు. వాళ్లపార్టీ కార్యకర్తలే ఆయనను నాయకుడిగా గుర్తించడంలేదని విమర్శించారు. రెండు సార్లు పార్లమెంటు సభ్యుడిగా లక్షల మెజార్టీతో, ఒక్కసారి ఎమ్మెల్యేగా 67 వేల మెజార్టీతో గెలిచిన కొత్తప్రభాకర్‌రెడ్డిని విమర్శించే స్థాయి చెరుకు శ్రీనివాస్‌రెడ్డిది కాదన్నారు. ఆయన నోరు అదుపులో పెట్టుకోకుంటే, బీఆర్ఎస్ కార్యకర్తలు గ్రామాలల్లో తిరగనివ్వరని హెచ్చరించారు.

ఘనంగా యువజన కాంగ్రెస్ దినోత్సవం



యువజన కాంగ్రెస్ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న నాయకులు

చేర్యాల/హుస్నాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): యూత్‌కాంగ్రెస్ 65వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం హుస్నాబాద్, చేర్యాల పటణాల్లో శనివారం యువజన కాంగ్రెస్ దినోత్సవాన్ని ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ యువజన కాంగ్రెస్ జెండాను నియోజకవర్గ అధ్యక్షులు కాంతాల శివరెడ్డి ఎగురవేసిన అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. చేర్యాలయూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కర్క సంతోశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజాహిత సంక్షేమ పథకాలు, అభివృద్ధిని గడప గడపకు వివరించి పార్టీ సంస్థాగత బలోపేతంతో స్థానిక సంస్థల ఎన్నికలలో విజయబావుట ఎగురవేయడంలో కార్యకర్తలు చిత్తశుద్ధితో పాటుపడాలని కోరారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలలో ఆకునూరు జడ్పీఎస్ఎస్ విద్యార్థుల ప్రతిభ

చేర్యాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సైన్స్ అండ్ స్టాండర్డ్స్ క్విజ్ రాష్ట్రస్థాయి పోటీలలో చేర్యాల మండలం ఆకునూరు జడ్పీఎస్ఎస్‌కు చెందిన పలువురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 9వ తరగతి విద్యార్థి బి.యశ్వంత్, 10వ తరగతి విద్యార్థి కె.మధు కన్సలేషన్ బహుమతిగా రూ.1,000 చొప్పున నగదు బహుమతి అందుకున్నారు. ఈమేరకు విద్యార్థులతో పాటు మెంటర్‌గా వ్యవహరించిన ఫిజికల్ సైన్స్ టీచర్ ఆర్.రవీందర్‌ను ఉపాధ్యాయులు అభినందించారు

కాంగ్రెస్ అధ్యకుడిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

కొండపాక, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్ పై దాడి చేసిన నర్సారెడ్డిని అరెస్టు చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశాడు. శనివారం విజయ్‌ను కొండపాకలోని తన నివాసంలో కలిసి శంకర్ దాడి వివరాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ ఈ నెల 3 గజ్వేల్ లో జరిగిన రేషన్ కార్డుల పంపిణీ ప్రభుత్వ కార్యక్రమంలో బహిరంగంగా కులం పేరుతో దూషించి, దాడి చేయడం తగదన్నారు. దాడిపై పోలీసులు ఎస్సీ ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చెసినప్పటికీ విచారణ చేయకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

హుస్నాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ కోర్సులలో ఖాళీగా ఉన్న సీట్లను ఈ నెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. పాలిసెట్ -25 ఉత్తీర్ణులైన విద్యార్థులు, పాలిసెట్ -25 ఉత్తీర్ణత సాధించని విద్యార్థులు, పాలిసెట్ - 25 హాజరుకాని విద్యార్థులు కూడా అర్హులని తెలిపారు. 11వ తేదీన ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. వివరాల కోసం హుస్నాబాద్ పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని కోరారు.

రోడ్డుపై దిగబడిన లారీ



దిగబడిన లారీని ఎక్స్‌కవేటర్ సహాయంతో బయటకు తీస్తున్న జనం

తొగుట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తొగుట మండలం మెట్టు గ్రామ శివారులోని సిద్దిపేట ప్రధాన రహదారి వర్షానికి పాడైపోయి అధ్వానంగా మారింది. శనివారం అదే రహదారిపై నుంచి వెళ్తున్న భారీలారీ రోడ్డుపై దిగబడిపోయింది. లారీని బయటకు తీయడానికి ఎక్స్‌కవేటర్‌లను తీసుకువచ్చి నానా తంటాలు పడాల్సి వచ్చింది. రోడ్డు నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డు పనులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో చండీ హోమం



చండీ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

హుస్నాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పౌర్ణమి సందర్భంగా చండీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహాగణపతి పూజ, నవగ్రహ పూజ, పంచామృత అభిషేకం, కుంకుమ పూజ, చండీ హోమం జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ చేశారు.

అసలే ఇరుకు.. ఆపై గుంతలు

(5వ పేజీ తరువాయి)

సుదూర మార్గాల గుండా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. దీంతో హైలెవల్ కల్వర్టు నిర్మాణం చేపట్టాలని ప్రజలు చాలాకాలంగా కోరుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు.

మొండికేస్తున్న కాంట్రాక్టర్లు..

తాడూరు క్రాస్‌రోడ్డు నుంచి చిట్యాల, కమలాయపల్లి గ్రామాల వరకు 9.70 కిలోమీటర్ల రోడ్డు విస్తరణకు ఆరు నెలల క్రితం పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.6.12 కోట్లు మంజూరయ్యాయి. అయితే, టెండర్లను ఎంఆర్ఆర్ పద్ధతిలో నిర్వహిస్తుండటంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీనివల్ల టెండర్ల ప్రక్రియ ఆలస్యం అవుతోంది. ప్రస్తుతం ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి కొత్తగా హ్యామ్ పద్ధతిని అనుసరిస్తోంది. ఇటీవల హ్యామ్ ఫేజ్-1 కింద పలు రోడ్లను చేర్చినప్పటికీ, తాడూరు రోడ్డును అందులో చేర్చలేదు. ఇప్పుడు టెండర్లు ఖరారు కాకపోతే, ఈ రోడ్డును హ్యామ్ ఫేజ్-2 లేదా ఫేజ్-3లో చేర్చే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. దీంతో రోడ్డు నిర్మాణం మరింత ఆలస్యం కావచ్చని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ప్రమాదకరంగా బీటీరోడ్డు

గతంలో రోడ్డు విస్తరణ కోసం నిధులు మంజూరైనప్పుడు, స్థానిక నేతలు పోటాపోటీగా పాలాభిషేకాలు చేశారు. కానీ, ఇప్పుడు పనుల జాప్యంపై ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. రాజకీయ వైరాన్ని పక్కన పెట్టి, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని త్వరగా పనులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

వెంటనే పనులు ప్రారంభించాలి



తాడూరు క్రాస్‌రోడ్డు నుంచి రోడ్డు దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. వర్షాకాలంలో లో-లెవల్ కాజ్‌వేమీదుగా వరదనీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. పనులను వెంటనే ప్రారంభించి ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలి.

- ఈరు పవన్, తాడూరు

చివరి దశలో టెండర్లు

గత జనవరిలో నిధులు మంజూరుకాగా, టెండర్లు మొదటి దశ చివరిలో ఉన్నాయి. కాంట్రాక్టర్లు ఆసక్తి చూపకపోవడంతో జాప్యం జరుగుతోంది. ఒకవేళ టెండర్ ఖరారు కాకపోతే, హ్యామ్ ఫేజ్-2 లేదా 3 ద్వారా పనులు చేపడతాం.

- పంచాయతీరాజ్ శాఖ డీఈ శ్రీనివాస్‌రెడ్డి